## క్లుప్తంగా

### మొక్కలను కాపాడాలి



రామాయంపేటలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): ప్రధాని పిలుపు మేరకు బీజేపీ కార్యకర్తలు మంగళవారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటారు. పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల మైదానం, హాస్టల్ వద్ద మొక్కలు నాటారు. తాము నాటిన మొక్కలను సంరక్షించాలని విజయకుమార్ హాస్టల్ విద్యార్థులకు సూచించారు. పార్టీ జిల్లా నాయకులు శంకర్‌గౌడ్, నవాత్ రాజేంద్రప్రసాద్, మండల శాఖ అధ్యక్షుడు దయానందరెడ్డి, నాయకులు నరేందర్, దామోదర్‌రావు, సతీశ్‌రావు, అనిల్, నిజాంపేట మండల నాయకులు పాల్గొన్నారు.

### చిలప్‌చెడ్ బీజేవైఎం అధ్యక్షుడిగా శివశంకర్



బీజేవైఎం అధ్యక్షుడిగా శివశంకర్‌కు పత్రం ఇస్తున్న శ్రీకాంత్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండల బీజేవైఎం అధ్యక్షుడిగా రాందాస్‌గూడ గ్రామానికి చెందిన కుర్మ శివశంకర్‌ను ఎంపిక చేశామని బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా చిలప్‌చెడ్‌కు చెందిన చాకలి రామకృష్ణను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు చంద్రారెడ్డి, రాజాగౌడ్ ఉన్నారు.

### వన మహోత్సవం



వృక్ష ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): మండలం పరిధిలోని గాజులగూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాయిసిరి చెట్ల ప్రాముఖ్యత, మొక్కలు నాటకుంటే మనుషులు ఎదుర్కొనే కష్టనష్టాల గురించి విద్యార్థులకు పాట రూపంలో పాడించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, వేణుగోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు

### పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు మంగళవారం పర్యవేక్షించారు. సంగాయిపేట, రంగంపేట, తుక్కాపూర్, ఎనగండ్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై గ్రామపంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు నగేష్, నాగరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

### రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి



జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఇంటికి పంపించడం అన్యాయమని యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు అంగన్‌వాడీలు మంగళవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ మాటాడారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు న్యాయంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# సీతానగర్‌లో మూతపడ్డ పాఠశాల



పాఠశాల ఎదుట కూర్చున్న విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): టీచర్లు లేక మూతపడ్డ పాఠశాలలున్నాయి కానీ టీచర్ ఉన్నా విధులకు రాకపోవడంతో పాఠశాల మూతపడింది. ఈ సంఘటన మండల పరిధిలోని సీతా నగర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగర్ ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఒక టీచర్ ఉన్నారు. అయితే సోమవారం టీచర్ సెలవులపై వెళ్లగా, రాంపూర్ గ్రామానికి చెందిన టీచర్‌ను సీతానగర్ పాఠశాలకు డిప్యూటేషన్ వేసి కొనసాగించారు. మంగళవారం టీచర్ విధులకు రాకపోవడంతో పాఠశాల మూతపడింది. పాఠశాల తలుపు ఎదుట విద్యార్థులు కూర్చొని టీచర్ రాక కోసం ఎదురు చూసి ఇళ్లకు వెళ్లిపోయారు. పాఠశాల మూతపడ్డ మండల, జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయంపై కాంప్లెక్స్ హెచ్‌ఎం ధనుంజయను ప్రశ్నించగా.. సీతానగర్ పాఠశాల ఉపాధ్యాయుడు సెలవులో వెళ్లడంతో రాంపూర్ రాథమికోన్నత పాఠశాలకు చెందిన దేవి సింగ్‌ను పంపించామని చెప్పారు.

## కనులపండువగా ఎల్లమ్మ బోనాలు



వెల్దుర్తిలో బోనాల ఊరేగింపు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### 12న ఉచిత వైద్య శిబిరం

నర్సాపూర్: మమత ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 12న నర్సాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. శిబిరంలో పలు స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అంగన్‌వాడీ టీచర్‌కు మెమో



సీతానగర్ తండా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ నాగమణి

అల్లాదుర్గం(మెదక్): తల్లి విధుల్లో కూతురు అంగన్‌వాడీ టీచర్‌గా పదేళ్ల బాలిక అనే శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి సీతానగర్ తండా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల రిజిస్టర్‌తో పాటు సరుకుల రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. కూతురుతో విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్‌కు మెమో జారీ చేశామన్నారు. గతంలో కూడా ఇదే విధంగా కూతురుతో విధులు చేయించారని తమ విచారణలో తేలిందన్నారు. మరోసారి ఇదేవిధంగా వ్యవహరిస్తే అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేస్తామని హెచ్చరించారు. తమ విధులు మరొకరితో చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని తెలిపారు. విధులు నిర్వహించని టీచర్లపై చర్యలు తప్పవని అన్నారు.

### ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న హనుమంత రావు

నిజాంపేట(మెదక్): మండలంలోని రాంపూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి, మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి ఎల్‌ఓసీని మైనంపల్లి హన్మంతరావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయంలో గత ఎన్నికల సమయంలో మొక్కిన మొక్కులను తీర్చుకున్నామని అన్నారు. మండలంలో ఏ గ్రామంలో నీటి సమస్య ఉన్న నెల రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గ సమస్య ఉన్న వెంటనే పరిష్కార దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు. వచ్చే నెల మొదటి రోజు నుంచి రైతు రుణమాఫీ ప్రక్రియ మొదలవుతుందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో ఫెన్సింగ్, పెయింటింగ్



అంకెలు, అక్షరాలతో పటం



అంగన్‌వాడీకి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

● అంగన్‌వాడీ టీచర్ ఔదార్యం..

చిన్నశంకరంపేట(మెదక్): అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకునే చిన్నారుల రక్షణ కోసం ఓ అంగన్‌వాడీ టీచర్ సొంత ఖర్చులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇది చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో సొంత ఖర్చులతో అందంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చారు టీచర్ మాలతీ. చిన్నారులను ఆకర్షించేలా పెయింటింగ్‌లు ఏర్పాటు చేసి, శిథిలమైన అంగన్‌వాడీ భవనం రూపురేఖలు మార్చారు. అందమైన కళాకృతులతో ఆకట్టుకునేలా రూపొందించారు. మరోవైపు చిన్నారులు పట్టుసాధించేలా అక్షరాలు, అంకెలతో పెయింటింగ్ చేయించారు. ఇందుకు అవసరమైన ఖర్చులను తనే సొంతగా భరించి అందమైన అంగన్‌వాడీ కేంద్రంగా రూపు మార్చారు. చిన్నారుల రక్షణ కోసం అవసరమైన ప్రహరీ లేకపోవడంతో పెన్సింగ్ ఏర్పాటు చేశారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాలు



రామాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఏబీవీపీ ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పట్టణాల్లో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ మెదక్ జిల్లా కన్వీనర్ శశికాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## పట్టణంలో సమస్యలను పరిష్కరించండి

● సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెదక్ సిటిజన్ ఫోరం సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి పాటుపడాలని మెదక్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జానకిరామ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున పట్టణంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంచినీటిని సరిపడా చేసే పంప్ హౌస్ వద్ద మురికి నీరు కలవకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అన్ని శ్మశాన వాటికల్లో అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. చిల్డ్రన్ పార్కులను అందుబాటులో తీసుకురావాలని కోరారు. అలాగే డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. పట్టణంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, స్థానిక జూనియర్ కళాశాలలో వాకర్స్‌కు లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. పలు సమస్యలను వినతి పత్రం ద్వారా మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు పిడి ఆనందం, నాగభూషణం, జీవరత్నం, బాలేశ్వర్‌గౌడ్, నరహరి, దయాసాగర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ పాఠశాలల తనిఖీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓ నేలకంఠం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మనల్ని అన్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎల్లేశం, సంగయ్య తదితరులు ఉన్నారు ఉన్నారు.

◆ జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లను మంజూరు చేయాలని మండల విలేకరులు రాంపూర్‌లో మైనంపల్లి హనుమంతరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భరత్‌రెడ్డి, సిద్దరాములు, స్వామి, బండారి చంద్రయ్య, జీడీ చంద్రకాంత్‌గౌడ్, సంజీవ్, బాల్‌రాజు, అజ్గర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

◆ కార్మికుల భిక్షాటన

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికులకు వేతనాలు రాకపోవడంతో మంగళవారం భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రం శివ్వంపేట గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు రాకపోవడంతో, వ్యాపార దుకాణాల్లో భిక్షాటన చేశారు. ప్రభుత్వం పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కార్మికులు వసంత, స్వరూప, సైతమ్మ, అశోక్, భాస్కర్, శ్రీకాంత్, వెంకటేష్, ఆగమయ్య డిమాండ్ చేశారు.

◆ నిర్మలారెడ్డిని కలిసిన డీసీసీ నేత



నర్సాపూర్: టీజీ ఐఐసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నిర్మలారెడ్డిని మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన వివరించారు.

◆ డివైడర్లు తొలగించాలి



పెద్దశంకరంపేట(మెదక్): 161వ జాతీయ ప్రధాన రహదారి కోళాపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద రోడ్డుపై అడ్డంగా ఉన్న డివైడర్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రాత్రి వేళ డివైడర్లు సక్రమంగా కనిపించకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్‌హెచ్ అధికారులు స్పందించి, డివైడర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● డాక్టర్ శ్యామల



బొడ్మట్‌పల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్యామల

టేక్మాల్(మెదక్): సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని పీడీఎంఓ డాక్టర్ శ్యామల తెలిపారు. మంగళవారం టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లిలో వైద్య సిబ్బంది ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. సీజనల్ వ్యాధులతో పాటూ దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పెషెంట్‌లతో పాటూ కీళ్ల నొప్పులకు మందులను అవసరమగు వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతీ ఒక్కరు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇందులో సీహెచ్‌ఓ మేరీ, పీహెచ్‌ఎన్ వసంత, ఏఎన్‌ఎంలు జయప్రద, పుష్పలత, నవీన, ఆశవర్కర్ నర్సమ్మ తదితరులు ఉన్నారు.

## ఆట, పాటలతో విద్యా బోధన చేయాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ విద్యార్థులకు ఆట, పాటలతో విద్యా బోధన చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. మంగళవారం శివ్వంపేట, మనోహరాబాద్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు నుంచి ఆరేళ్ల పిల్లల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేంద్రాల్లోని పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా ఇవ్వడంతో పాటు వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు టీచర్లు పాటుపడాలన్నారు. విధులపై అంకితభావంతో పనిచేసే టీచర్లకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు సంతోష, వసుమతి తదితరులు ఉన్నారు.

## జీలుగ పంట పరిశీలన



జీలుగ పంటను పరిశీలిస్తున్న అధికారి

రామాయంపేట(మెదక్): మోతాదుకు మించి ఎరువుల వాడకం, పంట వ్యర్థాలను కాల్చివేయడం, పంటల మార్పిడి చేపట్టకపోవడం, తదితర కారణాలతో భూమిలో సేంద్రియ కర్బనం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలో కాత్రియాలలో సాగవుతున్న జీలుగ క్షేత్రాన్ని సందర్శించారు. భూమిలో సేంద్రియ కర్బనం పెంపుదల విషయమై రైతులకు అవగాహన కల్పించారు జీలుగ, జనుము పంటను భూమిలో కలియ దున్నకానికి ముందు భూమిలో వంద కేజీల సూపర్ ఫాస్ఫేట్ చల్లాలని వ్యవసాయ అధికారి సూచించారు. వ్యవసాయ విస్తీర్ణాధికారి సాయి కృషన్, రైతులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన నీటినే తాగాలి



చిట్కుల్‌లో ఉన్నత పాఠశాలలలో తాగునీటిని పరీక్షిస్తున్న జల్ జీవన్ మిషన్ సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజలు పోషకాలతో కూడిన స్వచ్ఛమైన నీటినే తాగాలని జల్ జీవన్ మిషన్ సర్వేయర్ సాయిబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చిట్కుల్ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ సిబ్బందితో కలసి తాగునీటిపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, పలు చోట్ల తాగునీటి నమూనాలను సేకరించి, వాటిని పరిశీలించామన్నారు. సేకరించిన నీటి నమూనాల్లో నీటి నాణ్యత, క్లోరినేషన్ తదితర వాటిని తెలుసుకొని, తాగు నీటిలో పోషకాలు ఎంతవరకు లభిస్తున్నాయో తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, జల్ జీవన్ మిషన్ సిబ్బంది గణేశ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. మంగళవారం పాఠశాలలో మండల నోడల్ ఆఫీసర్ నీరజ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శంకర్‌సింగ్‌రాథోడ్, చక్రధర్‌శర్మ, లలిత, ఈశ్వరయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాజేశ్వర్, సురేందర్, వెంకటేశ్, రాధ, రేఖ, సరస్వతి, రమ, మనోహర్, శ్రీవాణి, భవాని, రమాదేవి, సుధాకర్‌రెడ్డి, సీఆర్పీ రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న అధికారులు

# దేవాలయ భూములు కాపాడండి

మనోహరాబాద్(తూప్రాన్): కబ్జాకు గురైన దేవాలయ భూములను కాపాడాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి కాళ్లకల్ గ్రామస్తులు వినతిపత్రం అందించారు. మంగళవారం ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని హనుమాన్ దేవాలయం పేరున 335,336 సర్వే నంబర్‌ల్లో పది ఎకరాలు దేవల్ రామలింగేశ్వర ఆలయం పేరున 338 సర్వేనంబర్‌లో 8ఎకరాల18 గుంటల భూమి ఉందన్నారు. రికార్డులు మార్చి దేవాలయ భూముల పేర్లు మార్చేశారని వాపోయారు. ఈభూములను సర్వే చేయించి దేవాలయాలకు కేటాయించాలని తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కాళ్లకల్ గ్రామస్తులు

## మట్టి తరలింపును అడ్డుకున్న వ్యక్తిపై దాడి

తూప్రాన్: అక్రమంగా మట్టి తరలింపును అడ్డుకున్న వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని పదో వార్డు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన శివ రమేశ్ అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న విషయాన్ని ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మట్టి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులు కాపుకాసి శివ రమేశ్‌పై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయంపై ఎస్‌ఐ శివానందంను వివరణ కోరగా.. బ్రహ్మణపల్లిలో వ్యక్తిగత కక్ష్యలతో గాయపర్చుకున్నట్లు తెలిపారు. మట్టి తరలింపుకు సంబంధం లేదని తెలిపారు.

## చిన్నారుల ఎదుగుదలకు బాలామృతం

వర్గల్(గజ్వేల్): చిన్నారుల ఎదుగుదలకు పోషక సంపన్నమైన బాలామృతం ప్లస్ దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. మంగళవారం మండలంలోని సింగాయపల్లిలో గ్రోత్ మేళా నిర్వహించారు. 5 ఏళ్ల లోపు 68 మంది చిన్నారుల బరువు, ఎత్తు కొలతలు పరిశీలించి నమోదు చేశారు. పిల్లల ఎత్తుకు తగిన బరువు ఉంటేనే ఆరోగ్యంగా ఎదుగుతారని, తేడా గుర్తించిన వారికి బాలామృతం ప్లస్ సిఫార్స్ చేశామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కిరణ్‌పాండియా పాల్గొన్నారు.